సాక్షి జగిత్యాల

సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



భక్తజన గోదావరి

ధర్మపురి: గోదావరి నదిలో ఆదివారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. గంగమ్మ గౌరమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

కోరుట్ల: తెలంగాణ జాగృతి యువజన విభాగం రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ కవిత ఆదివారం ఆవిష్కరించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/15.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి పూట ఎండగా ఉంటుంది. సాయంత్రం చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



స్టాల్ పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లత

జగిత్యాలజోన్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని అడిషనల్ కలెక్టర్ లత సూచించారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన మహిళా సాధికారిత మేళాను ఆదివారం లత ప్రారంభించి మాట్లాడారు. నాబార్డు.. మహిళా సాధికారితకు కృషి చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం మంచి పరిణామమన్నారు. గ్రామీణ మహిళలు నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి తక్కువ ధరకు వినియోగదారులకు అందించడం అభినందనీయమన్నారు. ప్లాస్టిక్‌రహిత ఉత్పత్తులను తయారు చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పెద్దపల్లి, ఖమ్మం, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల మహిళలు తయారు చేసిన వస్తువులకు మంచి ఆదరణ లభిస్తుందని కితాబునిచ్చారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, నాబార్డు ఏజీఎం మనోహర్‌రెడ్డి, సెర్ప్ డీపీఎం మల్లేశం, ఏపీఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు



నిర్మాణాలు తొలగిస్తున్న సిబ్బంది

జగిత్యాలరూరల్: ఆలయ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఈవో వేణుగోపాల్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయ ధర్మశాల భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు, కట్టడాలకు ఎలాంటి చోటు లేదన్నారు. ఇలా వ్యవహరిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది కొండ్ర రవి, భార్గవ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాజేందర్

బుగ్గారం(ధర్మపురి): స్థానిక ముత్యాల పోచమ్మ-నల్లపోచమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా చేపట్టిన ఎడ్లబండ్ల పోటీలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ పోటీలు ప్రారంభించారు. వివిధ మండలాల నుంచి పోటీదారులు హాజరయ్యారు. ప్రథమ బహుమతిని వెనుగుమట్ల గ్రామానికి చెందిన నేరెళ్ల శేఖర్‌గౌడ్, ద్వితీయ బహుమతిని రాపల్లెకు చెందిన రాజేశ్వరస్వామి, తృతీయ బహుమతిని టేకులపల్లెకు చెందిన సీతవేని బీరయ్య, మలిడి గ్రామానికి చెందిన పత్తిపాక రాజయ్య గెలుచుకున్నారు. సర్పంచ్ సుమలత, వైస్ ఎంపీపీ సుచేందర్, నాయకులు మూల శ్రీనివాస్‌గౌడ్, పెద్దనవేని శంకర్, అబ్దుల్ రహమాన్, పొన్నం సత్తయ్యగౌడ్, జంగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులతో సీఐ రాజశేఖర్‌రాజు

కోరుట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. కోరుట్ల కాలేజ్ గ్రౌండ్ వాకర్స్, వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వాలీబాల్ సీనియర్ క్రీడాకారుడు దివంగత సయిద్ జ్ఞాపకార్థం టోర్నీ నిర్వహిస్తున్నారు. సీఐ రాజశేఖర్‌రాజు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన, పతాకావిష్కరణ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నుంచి 28 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, నాయకులు గుంటుక విజయ్, జిందం లక్ష్మీనారాయణ, రషీద్, మజీద్ పాల్గొన్నారు.

పసుపు బోర్డు ఏ'మాయే'..!



జగిత్యాల శివారులో పసుపు తవ్వుతున్న రైతులు, కూలీలు

- మద్దతు ధర సాధన కోసం ఉద్యమం
- అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్న అన్నదాతలు

జగిత్యాలఅగ్రికల్చర్: పసుపు బోర్డు ఏర్పాటు, మద్దతు ధర సాధన కోసం జిల్లాలోని పసుపు రైతులు ఉద్యమించేందుకు సన్నద్ధమవుతున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం కొంత కాలంగా పోరాటాలు చేస్తున్నా.. విజయం సాధించలేకపోతున్నారు. ఈసారైనా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి లక్ష్యం సాధించాలని ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నారు.

దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించినా..

- జిల్లాలో సుమారు 45వేల ఎకరాల్లో పసుపు పంట పండిస్తున్నారు.
- క్వింటాల్‌కు రూ.15 వేల మద్దతు ధర చెల్లించాలని, పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.
- ధర్నాలు, రాస్తారోకోలతో సమస్యను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నారు.
- అయినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దగా స్పందించడంలేదు.
- పైగా ప్రతీ ఎన్నికల్లోనూ వివిధ రాజకీయ పార్టీలు పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని, మద్దతు ధర కల్పిస్తామని రైతులను మభ్యపెట్టి ఓట్లు దండుకుంటున్నాయి. ఆ తర్వాత పట్టించుకోడంలేదు.
- దీంతో గత ఎన్నికల్లో ఏకంగా నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి 175 మంది పసుపు రైతులు నామినేషన్లు దాఖలు చేసి దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించారు.
- చివరకు ఎన్నికల ఫలితాలు, నాయకులు మారారు. కానీ, పసుపు రైతుల ఆశలు నెరవేరలేదు. లక్ష్యం సాధించలేకపోయారు.
- ఈసారి రోజురోజుకూ తగ్గుతున్న పసుపు ధరలతో రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. సర్కార్లపై ఆగ్రహంతో ఉన్నారు.
- రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ తమ సత్తా చాటేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

సుంగధ ద్రవ్యాల బోర్డుకు బదులు..

- సుగంధ ద్రవ్యాల బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి నిజామాబాద్‌లో స్పైస్ బోర్డు ఏర్పాటు చేశారని, దీనిద్వారా తమకు ఒరిగేదేమీ లేదని రైతులు మండిపడుతున్నారు.
- పసుపు బోర్డు ఏర్పాటైతే.. కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, మార్కెట్లో ధరలు పతనమైతే.. బోర్డు రంగ ప్రవేశం చేసి తమకు నష్టం రాకుండా కొనుగోలు చేస్తూ ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.
- బోర్డు ద్వారా యాజమాన్య పద్ధతులు నేర్పించి, నాణ్యమైన పంట దిగుబడి సాధించేలా, విదేశాలకు ఎగుమతి చేసేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.
- అంతేకాదు.. ఆధునిక ట్రాక్టర్లు, డ్రిప్ పరికరాలు, పసుపు వేసే, కలుపు తీసే, ఉడుక బెట్టే, పాలిష్ చేసే యంత్రాలు రాయితీపై తమ దరిచేరే అవకాశం ఉంటుందని అన్నదాతలు అంటున్నారు.
- పెట్టుబడి తగ్గి ఆశించిన ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని అంటున్నారు.
- పసుపును నిల్వ చేసేందుకు అవసరమైన కోల్డ్ స్టోరేజీలు, గోడౌన్లు నిర్మించుకునే వెసులుబాటు కూడా ఉంటుందని అంటున్నారు.

పాలకులు స్పందించాలి



పసుపు రైతులకు మద్దతు ధర విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి. కేంద్రప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించాలి. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ చెల్లించాలి. దీనిద్వారా పసుపు రైతులకు కొంతలో కొంతైనా ఉపశమనం కలుగుతుంది.

– వాకిటి సత్యంరెడ్డి, పసుపు రైతు, మల్లాపూర్

ధర లేకపోతే ఎలా?



ఈసారి అధికంగా కురిసిన వర్షాలతో ఆశించిన స్థాయిలో పసుపు దిగుబడి రాలేదు. ఎకరాకి 20 క్వింటాళ్ల – 10 క్వింటాళ్ల వరకు పడిపోయింది. గతంలో క్వింటాలుకు రూ.15 వేలు పలికిన ధర.. ఇప్పుడు రూ.5వేల – రూ.6 వేలకు పడిపోయింది. పెట్టుబడి కూడా రాకపోతే ఎలా? రైతులు బతికేదెలా?

– మామిడి నారాయణరెడ్డి, పసుపు రైతు, మెట్‌పల్లి

దిగుబడి సుమారు రూ.7లక్షల క్వింటాళ్లు..

- జిల్లాలో పసుపు దిగుబడి సుమారు 6లక్షల – 7 లక్షల క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కానీ, మార్కెట్‌లో ధరలు చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాపై దాదాపు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి, ఏడాదిపాటు శ్రమిస్తే పంట చేతికి వస్తుంది. కానీ, పెరుగుతున్న పెట్టుబడికి, మార్కెట్‌లో ధరలకు ఏమాత్రం పొంతన లేకపోవడంతో పెట్టుబడి ఏమో గానీ.. నష్టాలపాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బల్దియాలో అవినీతి బాగోతం!

- భవన నిర్మాణదారుల నుంచి అక్రమంగా వసూళ్లు
- అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం



మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

మెట్‌పల్లి(కోరుట్ల): బల్దియాలో కొందరు మహిళా ప్రజాప్రతినిధుల భర్తలు భవన నిర్మాణదారుల నుంచి నిర్బంధంగా మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల పురపాలికలో చోటుచేసుకున్న ఘటనలు ఇదే విషయాన్ని బహిర్గతం చేస్తున్నాయి.

విచ్చలవిడిగా వసూళ్లు..

- మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఓ ఎనిమిది మంది కౌన్సిలర్లు భవన నిర్మాణదారుల నుంచి విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- కొందరు మరో అడుగు ముందుకు వేసి మామూళ్ల కోసం యజమానులను వేధించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.
- వీటిని భరించలేక పలువురు నిర్మాణదారులు.. ముఖ్య నేతలను కలిసి ఫిర్యాదు చేశారు. అయినా, ముఖ్యనేతలు ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి.
- వాస్తవానికి అవినీతికి పాల్పడే కౌన్సిలర్లను సస్పెండ్ చేయడంతోపాటు అవసరమైతే సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఉన్నతాధికారులకు ఉందని చెబుతున్నారు.
- అవినీతికి పాల్పడే ప్రభుత్వ ఉద్యోగులపైనే కాకుండా ప్రజాప్రతినిధులు, వారి పేరిట అక్రమ వసూళ్లు చేసేవారిపైనా ఏసీబీ చర్యలు తీసుకునే అధికారం ఉందని అధికారులు చెబుతున్నారు.
- కానీ, రాజకీయ నేతల విషయంలో ఫిర్యాదులు వస్తున్నా తగిన చర్యలు తీసుకునేందుకు ఆయా యంత్రాంగాలు వెనుకంజ వేస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- ఆది ఓ మహిళా కౌన్సిలర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు. ఓ వ్యక్తి ఇటీవల భవన నిర్మాణం మొదలుపెట్టాడు. సమాచారం అందుకున్న ఆ కౌన్సిలర్ భర్త.. తనకు రూ.50వేలు మామూలు ఇవ్వాలని మధ్యవర్తి ద్వారా యజమానికి కబురు పంపగా, నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయని, తాను డబ్బులు ఇవ్వనని బదులిచ్చాడు. ఆగ్రహించిన కౌన్సిలర్ భర్త.. మున్సిపల్ సిబ్బందిని పంపించి పలుసార్లు ఇంటి పనులు ఆపివేయించారు. ఆగ్రహించిన బాధితుడు.. ఈ విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. తనకు న్యాయం చేయాలని విన్నవించాడు. ఇందుకు వారు సానుకూలత వ్యక్తం చేయలేదని బాధితుడు వాపోయాడు. గత్యంతరం లేక కౌన్సిలర్ భర్త అడిగినంత ఇచ్చుకోవడంతో పనులు సాఫీగా సాగాయి.
- ప్రతిపక్ష పార్టీకి చెందిన మరో మహిళా కౌన్సిలర్ భర్త కొంతకాలం క్రితం తనవార్డులో ఇంటి నిర్మాణం చేపట్టిన ఓ వ్యక్తి నుంచి రూ.లక్ష డిమాండ్ చేశారు. ఇంటి అనుమతుల కోసం మున్సిపల్ ఫీజు రూ.70వేలు చెల్లించాల్సి ఉంటే.. సదరు నాయకుడు లంచం కింద రూ.లక్ష డిమాండ్ చేయడంపై కంగుతిన్న నిర్మాణదారు.. అప్పటి అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి ఫిర్యాదు చేశాడు. తీవ్రంగా పరిగణించిన అదనపు కలెక్టర్.. మున్సిపల్ కార్యాలయానికి వచ్చి విచారణ జరిపారు. సదరు కౌన్సిలర్‌తోపాటు ఆమె భర్తను పిలిపించి వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లంచం అడిగినట్లు సాక్ష్యం ఇస్తే కౌన్సిలర్ సభ్యత్వాన్ని రద్దు చేయిస్తామని ఫిర్యాదుదారుకు సూచించారు. కానీ, బాధితుడి వద్ద సాక్ష్యం లేకపోవడంతో.. ఆ నాయకుడిని మందలించి వదిలేశారు. అప్పట్లో ఈఘటన చర్చనీయాంశమైంది. ఈచర్యతో కౌన్సిలర్ భర్త.. అక్రమ వసూళ్లకు దూరంగా ఉంటున్నారు.

నోటీసులు ఇస్తున్నాం

అనుమతులు తీసుకొని భవన నిర్మాణం చేపట్టే వారు నిబంధనల ప్రకారం పనులు చేయడంలేదు. ఇలాంటి వారికే నోటీసులు జారీ చేస్తున్నాం. అంతేగానీ, పనులు అడ్డుకోవడం లేదు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై ఎవరి ఒత్తిడి లేదు. అనుమతులు తీసుకొని పనుల విషయంలో నిబంధనలు పాటిస్తే ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– సాయికృష్ణ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, మెట్‌పల్లి

ఫిర్యాదు చేస్తే చర్యలు

ఏసీబీకి అందే ఫిర్యాదులకు సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేయలేం. వాటిని రహస్యంగా ఉంచి విచారణ జరుపుతాం. ప్రభుత్వం నుంచి వేతనం తీసుకునే ఎవరైనా అవినీతికి పాల్పడితే బాధితులు ఏసీబీకి ఫిర్యాదు చేయవచ్చు.

– భద్రయ్య, డీఎస్పీ, ఏసీబీ

బీఆర్‌ఎస్, బీజేపీ చీకటి ఒప్పందం

- బీఎస్పీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



పాదయాత్రలో ప్రవీణ్‌కుమార్

పెగడపల్లి(ధర్మపురి): నిధులు, నియామకాల పేరిట అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ప్రజలను అడుగడుగునా మోసం చేస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. సుద్దపల్లి, బతికపల్లి, మద్దులపల్లి, నామాపూర్, కీచులాటపల్లి, ల్యాగలమర్రి, ఏడుమోటలపల్లి గ్రామాల్లో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర చేపట్టారు. నామాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య చీకటి ఒప్పందం కుదిరిందని, అందుకే ఆ రెండు పార్టీలు ఏకమై లిక్కర్ స్కాం, అదానీ ఆస్తులపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించడం లేదన్నారు. రెండు పార్టీలు బీసీ రిజర్వేషన్లు పెంచే బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టకుండా కుట్ర చేస్తున్నాయన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టకపోతే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను గ్రామాల్లో తిరగనివ్వబోమని ఆయన హెచ్చరించారు. ధర్మపురి నియోజకవర్గంలో మంత్రి ఈశ్వర్ చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. కాళేశ్వరం నిర్వాసితులకు పరిహారం ఇప్పించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే పాలకులు దోచుకున్న రూ.వేలకోట్లను గల్లాపట్టి వాపస్ తీసుకొచ్చి విద్య, వైద్యం, ఉపాధి కల్పన కోసం వెచ్చిస్తామన్నారు. నాయకులు శంకర్, లింబాద్రి. విజయ్‌కుమార్, గంగాధర్ ఉన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

జగిత్యాలరూరల్: అంబారిపేట శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా జరిపించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే సంజయ్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మొక్కులు చెల్లించుకున్నారు. తాటిపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో రథయాత్ర నిర్వహించారు.

చట్ట సభలు పవిత్ర దేవాలయాలు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: చట్ట సభలు పవిత్ర దేవాలయాలని, ప్రజాస్వామ్య విలువలు కాపాడాల్సిన బాధ్యత ప్రతీ సభ్యుడిపై ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాస్తవాలు మాట్లాడాల్సిన చట్ట సభల్లో సంఖ్యాబలంతో విపక్షాల నోరునొక్కడం సరికాదని విమర్శించారు. 24గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని మంత్రి కేటీఆర్ చెప్పడం సరికాదని, తీగలను పట్టుకుంటే కరెంట్ ఉందోలేదో తెలుస్తుందని ఎద్దేవా చేశారు. ఏసీడీ చార్జీలు ఉపసంహరించుకున్న సంస్థ సీఎండీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఉదయం 8గంటలు, రాత్రి 5గంటలకుపైగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గిరి నాగభూషణం, విజయలక్ష్మి, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, గాజంగి నందయ్య, శంకర్, అశోక్, రాజేందర్ ఉన్నారు.

సాగునీటి చర్యలు వేగవంతం చేయాలి

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ రోళ్లవాగు ఎగువన ఉన్న గ్రామాలకు సాగునీరు అందించే పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. బుగ్గచెరువు గ్రామాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన ఆయా ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. సింగిల్‌విండో చైర్మన్ నవీన్‌రావు ఉన్నారు.

న్యాయవ్యవస్థపై విశ్వాసం కల్పించాలి

- న్యాయ సంరక్షణకు అందరూ కృషిచేయాలి
- జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో 16,465 కేసులు పెండింగ్
- పెండింగ్ కేసుల పరిష్కారానికి అందరూ సహకరించాలి
- 1013 కేసులు నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు..
- జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్



జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్

సాక్షి, పెద్దపల్లి/ధర్మారం: న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించే దిశగా ప్రతిఒక్కరూ కృషిచేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. ధర్మారం మండలం నందిమేడారంలో ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆదివారం ప్రారంభించారు. ముందుగా వారికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు, కలెక్టర్ సంగీత, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.సురేశ్ బాబు న్యాయమూర్తులకు స్వాగతం పలికారు. పండితులు వేదమంత్రాల మధ్య పూర్ణకుంభంతో ఆహ్వానించారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కోర్టును ప్రారంభించిన న్యాయమూర్తులు సర్వమత ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ భవిష్యత్‌లో కోర్టుల సంఖ్య పెంచేందుకు కృషిచేస్తామని, కోర్టుల్లో వసతుల కల్పనకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలన్నారు. తనకు తెలుగు భాష అంటే మక్కువని, చిన్నతనంలో నందమూరి తారకరామారావు ప్రసంగం వినేవాడినని, అదే సమయంలో ఆయన హిందీ భాష తీరును చూసి ఆశ్చర్యపోయేవాడినని గుర్తు చేశారు. కోర్టుల్లో వాడే భాష స్థానిక ప్రజలకు అర్థమయ్యేలా ఉంటే మరింత చేరువగా న్యాయ వ్యవస్థ పని చేస్తుందని అభిప్రాయపడ్డారు. భాష కేవలం ఇతరులకు కమ్యూనికేట్ చేసే సాధనం మాత్రమేనని, దీనికి సంబంధించి గౌహతిలో జూనియర్ సెలక్షన్ కమిటీలో జరిగిన సంఘటనను వివరించారు. మంచి పరిజ్ఞానం ఉన్న జడ్జిలను తాను ఎంపిక చేశానని తెలిపారు. మారుమూల గ్రామమైన నందిమేడారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గర్వకారణమని, దీనివల్ల ప్రజలకు చేరువలోనే న్యాయం అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. హైకోర్టు జస్టిస్ పి.నవీన్‌రావుపై ఉన్న గౌరవంతో 14మంది హైకోర్టు జడ్జిలు వచ్చి ఇక్కడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించడం మరింత శోభ సంతరించుకుందని అన్నారు. జిల్లాలో రెండో శతాబ్దానికి చెందిన బౌద్ధ స్తూపాలు, ఓదెల మల్లికార్జునస్వామి, కమాన్‌పూర్‌లో శ్రీఆదివరాహస్వామి ఆలయం, రామగిరి ఖిల్లా వంటి ప్రాంతాలు ఉన్నాయని గుర్తు చేశారు.

16,465 కేసులు పెండింగ్..

జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో 16,465 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని న్యాయమూర్తి భూయాన్ తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి వసతులు కల్పించడంతోపాటు నూతన కోర్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, న్యాయవాదులు, ప్రజలు సహకరించాలని కోరారు. నందిమేడారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని త్వరగా పూర్తిచేసేందుకు సహకరించిన కలెక్టర్, అధికార యంత్రానికి అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, జడ్జిలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ సెక్రటరీ భాస్కర్, ప్రజాప్రతినిధులు, న్యాయ అధికారులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. కోర్టు ప్రారంభోత్సవం అనంతరం జడ్జిల బృందం కాళేశ్వరం ప్రాజెక్టులోని నందిమేడారం అండర్ టన్నెల్‌ను సందర్శించారు.

ప్రతిఒక్కరూ సహకరించాలి



నా సొంత గ్రామంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చాలా సంతోషంగా ఉంది. కోర్టులో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఒక్కో కేసు 20 నుంచి 30 ఏళ్లపాటు సాగడం ద్వారా ఎవరికీ న్యాయం జరగదు. ప్రతి వెయ్యి కేసులకు ఒక్క కోర్టు ఉంటే బాగుంటుంది.

– హైకోర్టు జడ్జి జస్టిస్ నవీన్‌రావు

గృహ ప్రవేశానికి వచ్చినట్లుంది



నంది మేడారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధికి 281 సివిల్ కేసులు, 732 క్రిమినల్ కేసులు మొత్తం 1013 కేసులు బదిలీ చేశాం. గ్రామస్థాయిలో కోర్టుల ఏర్పాటుతో ప్రజలకు సత్వర న్యాయం అందే అవకాశం ఉంది. కోర్టు ప్రారంభానికి కాకుండా మా ఇంటి గృహప్రవేశానికి వచ్చినట్లు ఉంది.

– ఎస్వీ.శ్రవణ్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి

క్లుప్తంగా

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వేడుకలు



కోరుట్ల: పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో 28వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కల్యాణ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఇందూరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బెజ్జారపు చందు, ప్రశాంత్, ఇందూరి సత్యం, తునికి భాస్కర్ శ్రీనివాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

భక్తుడికి సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఏఎస్సై శ్రీనివాస్

మల్యాల: మల్యాల మండల ముత్యంపేటలోని కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం కోసం వచ్చి సెల్‌ఫోన్ మరిచిపోయిన భక్తుడికి ఏఎస్సై తిరిగి సెల్‌ఫోన్ అప్పగించారు. సిద్దిపేట జిల్లా గాగిల్లాపూర్ మండలం మాధవరెడ్డి గ్రామానికి చెందిన చింతలపల్లి శ్రీనివాస్ తన కుటుంబసభ్యులతో కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ దర్శనానికి వచ్చి పోలీసు అవుట్‌పోస్టులో సెల్‌ఫోన్ మరిచిపోయి వెళ్లిపోయాడు. దీంతో భక్తుడు శ్రీనివాస్‌కు సమాచారం అందించి సెల్‌ఫోన్‌ను తిరిగి అప్పగించారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారంకు చెందిన మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన అల్లూరి సత్తిరెడ్డిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. అల్లూరి సత్తిరెడ్డి మహిళ ఇంట్లోకి వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడని బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శ



ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని వేంపల్లిలో శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధురాలు అర్కల చిన్నమ్మ కుటుంబాన్ని సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉప సర్పంచ్ వెల్మల రాజనర్సయ్య, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌లతో పాటు వార్డు సభ్యులు పరామర్శించారు. గ్రామపంచాయతీ నిధుల నుంచి దహనసంస్కారాలకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పాలకవర్గ తీర్మానం ప్రకారం గ్రామంలో ఎవరు మృతి చెందినా దహన సంస్కారాలకు రూ.10వేలు సాయం చేస్తున్నట్లు తెలిపారు.

రాములపల్లిలో కాలువకు గండి

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని రాములపల్లి శివారులో 10ఎల్ కాలువకు శనివారం రాత్రి గండిపడడంతో కాలువ కిందనున్న వరి పొలాలు నీటమునిగాయి. పొలాల్లో ఇసుకమేటలు వేసి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులకు రైతులు సమాచారం అందించగా, గండిపడిన చోట తాత్కాలికంగా ఇసుకబస్తాలను అడ్డుగా వేసి కాలువ నీరు పంట పొలాలకు వెళ్లకుండా సరిచేశారు. ఇదే కెనాల్‌కు కల్వర్టు వద్ద పైపులు వేయడంతో నీరు వెళ్లక కెనాల్‌కు గండి పడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు

వ్యవసాయ పరిశోధనలకు కేరాఫ్ పొలాస

- దేశంలోని వరి రకాలపై శాస్త్రవేత్తల పరిశోధనలు
- అధిక దిగుబడినిచ్చే విత్తనాలపై పరిశీలన



వివిధ వరి రకాల నారు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం వ్యవసాయ పరిశోధనలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పరిశోధన స్థానంలోని శాస్త్రవేత్తలు నూతన వంగడాలను రూపొందించడానికి ఒక్క వరిలోనే దాదాపు 500 రకాలపై పరిశోధనలు చేస్తున్నారు. కొత్త వంగడాల ఆవిష్కరణలో భాగంగా వాటి రకం, దిగుబడి, తెగుళ్లను ఎలా తట్టుకుంటుంది.. అనే విషయాలను పరిశీలిస్తుంటారు.

దేశంలోని 500 వరి రకాలపై..

దేశంలోని వ్యవసాయ యూనివర్శిటీల నుంచి సేకరించిన దాదాపు 500 వరి రకాలపై పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో పరిశోధనలు చేస్తున్నారు. ఆయా రాష్ట్రాల నుంచి సేకరించిన విత్తనాలను వరి నారుగా పోసి, ఒక్క పంట కాలం పరీక్షిస్తున్నారు. వరి రకాలను ఒక్కో చదరపు మడిలో నాటు వేస్తారు. ఏ రకం విత్తనం దిగుబడి ఎక్కువగా ఇస్తుంది. ఏ రకం విత్తనం, చలిని, తెగుళ్లను తట్టుకోవడం లేదనే తదితర విషయాలను శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా పరిశీలిస్తుంటారు. అలాగే ఏ రకం విత్తనాన్ని, మరే ఏ రకం విత్తనంతో సంకరకరణం చేసి అధిక దిగుబడి నిచ్చే కొత్త రకం విత్తనాన్ని తయారు చేయవచ్చనే దానిపై ప్రతిరోజూ పరిశీలిస్తుంటారు. అలాగే,ఏ రకంలో తాలు గింజలు ఎక్కువగా వచ్చాయి, గింజల బరువు ఎలా ఉంటుందనే విషయాలపై ప్రత్యేకంగా నివేదిక తయారు చేసి, అయా శాస్త్రవేత్తలతో చర్చిస్తుంటారు.

చాలా జాగ్రత్తగా..

పశ్చిమబెంగాల్‌లో అధిక దిగుబడి వచ్చిన విత్తనం ఇక్కడ ఎలాంటి దిగుబడులు వచ్చాయి. ఇక్కడి వాతావరణాన్ని ఏ మేరకు తట్టుకుంటుంది అనే విషయాలను తెలుసుకుంటారు. ప్రధానంగా ఇక్కడి వాతావరణాన్ని తట్టుకున్న రకాలపై మళ్లీ రకరకాల పరిశోధనలు చేస్తుంటారు. ఒక రకం విత్తనం మరో రకం విత్తనంతో కలువకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. గింజ దశకు మారే సమయంలో గాలికి ఒక రకం పుప్పొడి మరో రకంపై పడకూడదని కవర్లు సైతం కడుతుంటారు. నారు పోసే సమయంలో కూడా గింజలు మట్టిపై వేసిన తర్వాత అవి ఏ రకం మొక్కలు తెలిసేందుకు అక్కడ ఒక్క కట్టెను పాతి దానిపై ఓ గుర్తు(అంకెలు) పెట్టుకుంటారు. కొన్ని రకాల గింజలు నల్లగా, తెల్లగా, మరికొన్ని గింజలు గోధుమ రంగులోనూ ఉంటాయి. అయా రకాల గింజలు దోడ్డు, సన్నం, మధ్యస్తంగా ఉంటున్నాయా అనే విషయాలు తెలుసుకుంటారు. శాస్త్రవేత్తలు రోజువారీ డైరీలో భాగంగా ప్రతీ విత్తనం లక్షణాలను రాసుకుంటారు. పంట కోత కోసిన తర్వాత ఏ రకం గింజలను ఆ రకం ప్యాకెట్లలో భద్రపరుస్తారు. అవి మూల విత్తనంగా పరిచేస్తాయని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు.

ఎలాంటి రకమో తెలుసుకునేందుకు..



దేశవ్యాప్తంగా అన్ని రకాల విత్తనాలు సేకరించి, ముందుగా పరిశోధనస్థానంలో నాటుతాం. ఓ పంట కాలం పాటు పరీక్షిస్తాం. ఆ రకం విత్తనాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయనే విషయాలను పరిశీలిస్తాం. మన వాతావరణాన్ని అయా రాష్ట్రాల విత్తనాలు ఎలా ఉన్నాయనే విషయాలు కూడా తెలుసుకుంటాం.

– డాక్టర్ శ్రీనివాస్, వరి శాస్త్రవేత్త, పొలాస

ఏ విత్తనంతో సంకరకరణం చేయాలో చూస్తాం



అన్ని రకాల విత్తనాలను పరిశీలించిన తర్వాత, ఏ రకం విత్తనాన్ని మరే రకం విత్తనంతో సంకరకరణం చేస్తే అధిక దిగుబడినిచ్చే కొత్త రకం విత్తనం వస్తుందని చూస్తాం. కొత్త రకం సైతం పురుగులు, తెగుళ్ల, చలిని తట్టుకునేలా అన్ని రకాల లక్షణాలు ఉన్నాయా.. లేవా అని పరిశీలిస్తాం.

– డాక్టర్ లక్ష్మీప్రసన్న, వరి శాస్త్రవేత్త, పొలాస

మానిక్‌రావు ఠాక్రేను కలిన వెంకటేశ్



మానిక్‌రావు ఠాక్రేతో వెంకటేశ్

కోరుట్ల: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మానిక్‌రావు ఠాక్రేను ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్‌గౌడ్ ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిశారు. హత్ సే హత్ జోడో యాత్ర నిర్వహణపై చర్చించారు. మానిక్‌రావును సన్మానించారు. ఆయన వెంట మధుయాష్కీగౌడ్, నదీమ్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగాపూర్ ఘటనపై లోతైన విచారణ

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గడ్డం జలపతిరెడ్డి(45) తన ఇద్దరు కుమార్తెలను బావిలో తోసి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కాగా జలపతిరెడ్డి ఓ సూసైడ్ నోట్‌ను జేబులో పెట్టుకోవడంతోపాటు దానిని అతడు ఆత్మహత్య చేసుకునే ముందు కుటుంబసభ్యులకు వాట్సాప్‌లో షేర్ చేయడంతో అసలు విషయం బయటపడింది. అతడు గత నెలరోజుల ముందు నుంచే మానసికంగా ఇబ్బందులు పడటంతోపాటు కుటుంబసభ్యుల వద్ద పలు రకాలు ప్రవర్తించినట్లు, అనుమానాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. అతడి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు లోతైన విచారణ చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు అధిక ప్రాధాన్యం



రేగుంటలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న విద్యాసాగర్‌రావు

మల్లాపూర్(కోరుట్ల): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు టీటీడీ బోర్డు సభ్యుడు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండలం రేగుంటలో జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌సింగ్‌తో కలిసి ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 4,300 ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే రెండు నెలల్లో 3,500పైగా ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందుకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు కూడా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, వైస్ ఎంపీపీ నగేశ్, తహసీల్దార్ రవీందర్, ఉద్యానశాఖ అధికారి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావ్‌పేటలో ప్రత్యేక పూజలు

వెంకట్రావుపేట గ్రామశివారులో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ సరోజన, ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులున్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

గుండంపల్లిలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆవిష్కరించారు. నైజాం, భూస్వాముల కబంధహస్తాల నుంచి విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. అనంతరం లడాయి మల్లన్నస్వామి జాతరలో పాల్గొని పూజలు చేశారు. సర్పంచ్ మల్లు, ఎంపీటీసీలు మంజుల, వేణు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ భవనానికి భూమిపూజ

కోరుట్లరూరల్: మండలంలోని తిమ్మయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆదివారం భూమిపూజ చేశారు. ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్, సర్పంచ్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

కోరుట్ల సాయిరామా నదీ తీరంలోని సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ లావణ్య, ఎంపీపీ నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కారు కాలువలో పడి ఒకరి మృతి



రిజ్వాన్ మృతదేహం



కాలువలో బోల్తా పడ్డ కారు

- మరో నలుగురికి గాయాలు
- రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది

జగిత్యాలక్రైమ్: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ రామాలయం వెనకాల గల ఎస్సారెస్పీ కాలువలో ఆదివారం రాత్రి కారు అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. పట్టణంలోని తులసినగర్ ప్రాంతంలో నివాసం ఉండే రిజ్వాన్(35), మరో నలుగురు స్నేహితులు కలిసి పని నిమిత్తం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం కారులో వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో ధరూర్ క్యాంపు సమీప ఎస్సారెస్పీ కాలువ వద్దకు రాగానే కారు అదుపు తప్పి అందులో పడిపోయింది. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఉన్న వారిని బయటకు తీశారు. ఆ వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వెళ్లాక రిజ్వాన్ మృతిచెందాడు. మిగిలిన నలుగురికి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడు ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు



గాయపడ్డ రమేశ్–అరుణ దంపతులు

మల్లాపూర్(కోరుట్ల): మల్లాపూర్ మండలంలోని సాతారం శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదులాపురం రమేశ్–అరుణ దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లికి చెందిన రమేశ్–అరుణలు ద్విచక్రవాహనంపై రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో శుభకార్యానికి హాజరై తిరిగి మెట్‌పల్లికి వస్తున్నారు. సాతారం–ధర్మారం మార్గంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి ఘటన స్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. తీవ్రంగా గాయపడ్డ వారిని 108 అంబులెన్సులో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

నేడు జోడో యాత్ర

ధర్మపురి: పట్టణంలో సోమవారం ఉదయం 8.30గంటలకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన హాత్ సే హాత్ జోడో పాదయాత్రను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ఆదివారం ఆయన పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేశ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.



స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



ధ్వజస్తంభం వద్ద మొక్కులు

పోటెత్తిన కొత్తగట్టు



కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు

శంకరపట్నం(మానకొండూర్): శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి పౌర్ణమి జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20వేల మంది తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. గుట్టపైకి వాహనాలను అనుమతించకపోవడంతో వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు ఘాట్‌రోడ్డు మీదుగా గుట్టపైకి చేరేందుకు టికెట్‌లు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. హుజూరాబాద్ రూరల్ సీఐ జనార్దన్, ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మలహాల్‌రావు, ఈవో సుధాకర్, సర్పంచ్ కిషన్‌రావు, ధర్మకర్తలు, అర్చకులు శేషం మురళీధరాచార్యులు, మాధవాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గడప గడపకూ ప్రచారం చేపట్టాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం

ధర్మపురి: భారతీయ జనతా పార్టీ విస్తరణ కోసం గడపగడపకూ ప్రచారం చేపట్టాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల మల్లేశం అన్నారు. ఆదివారం మండలంలోని రాయపట్నంలో పార్టీ మండల అధ్యక్షుడు సంగెపు గంగారాం అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 10 నుంచి 2వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో వీధి సమావేశాలు నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై చైన్యతవంతులను చేయాలన్నారు. ఈ సమావేశంలో దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, ఎంపీటీసీ ఆకుబత్తిని తిరుపతి, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి అమ్ముల నరేశ్, నాయకులు రాందేని బాపు, వైకుంఠం, వెలుగు గంగాధర్, కడారి గంగాధర్, సోగాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్నీ అభివృద్ధిపథంలో నడిపిస్తున్నాం




గ్రామపంచాయితీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మల్యాల(చొప్పదండి): చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్నీ అభివృద్ధిపథంలో నడిపిస్తున్నామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని మ్యాడంపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల్లో రూ.40లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు, రూ.20లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న ఏకైక సీఎం కేసీఆర్ అని కొనియాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. దళితబంధు, రైతుబంధు పథకాలపై ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ఘాటు మాటలు మాట్లాడుతూ కాలం వెలదీస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రౌతు గంగామహేశ్వరి, గొడుగు కుమారస్వామి, జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, మాజీ ఎంపీపీ ఎడిపెల్లి అశోక్, మాజీ సర్పంచ్ రౌతు రవి, ఉప సర్పంచ్ మంద మహేశ్ పాల్గొన్నారు.

శంకర్‌కు రాష్ట్రస్థాయి బహుమతి



శంకర్



బహుమతి పొందిన కార్టూన్

కోరుట్లటౌన్: పట్టణానికి చెందిన ద్యావనపెల్లి శంకర్ రాష్ట్రస్థాయి కార్టూన్ పోటీల్లో ప్రతిభ చూపారు. ఆదివారం హైదరాబాద్‌లో కేవీ రమణాచారి చేతులమీదుగా ఆయన జ్ఞాపిక, ప్రశంసాపత్రం, సత్కారం అందుకున్నారు. హాస్యానందం, గుడిబండి వెంకట్‌రెడ్డి సంయుక్తంగా రాష్ట్రస్థాయి కార్టూన్ పోటీలు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 100 మంది కార్టూనిస్టులు హాజరై ప్రతిభ చూపారు. శంకర్ గీసిన కార్టూన్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. స్థానిక కార్టూనిస్టులు శంకర్‌కు అభినందనలు తెలిపారు.

దోలోత్సవం.. తెప్పోత్సవం





బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారిని చందనం, ప్రత్యేక ఆభరణాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమశాలలో హోమం జరిపారు. రాత్రి 8 గంటలకు దోలోత్సవం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు కోనేరులో అందంగా తయారు చేసి తెప్పపై స్వామి వారిని ఊరేగించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఆలయ ఈవో సంకుటాల శ్రీనివాస్, అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోశ్, చిన్న సంతోశ్, మధుకుమారాచార్యులు, మాజీ ఎంపీపీ కొల్ముల శారద, మాజీ జెడ్పీటీసీ ముప్పాల జలజ, కొల్ముల రమణ, ఆలయ మాజీ చైర్మన్లు గొడుగు కేశవులు, నేరెల్ల సుమన్‌గౌడ్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. – సారంగాపూర్(జగిత్యాల)